# సింగిల్ పేజీ కథలు

## బాల్యం

ట్రైను విశాఖపట్నం చేరుకునేసరికి సాయంత్రం ఐదు గంటలయింది. స్టేషను బైటకొచ్చి వెళ్ళగా ఆటో మాట్లాడుకుని ఇనుక తోటలో వుంటున్న మా అబ్బాయి యింటికి చేరుకోవడానికి మరో అరగంట పట్టింది.

గేటు ముందు నిలబడి, ఆ యింటిని కనులారా చూసుకుంటుంటే అంతులేని సంతృప్తి...నీరజలోనూ అదే విజయగర్వం.

నా ముప్పయి రెండేళ్ళ సర్వీసులో పాత పెంకుటింట్లో అద్దెకుంటున్న స్థాయి నుండి రెండు గదుల చిన్న డాబా యింటికి స్వంతదారుగా ఎదగడం, అమ్మాయికి ఏదో చెప్పుకోదగ్గ సంబంధమే చూసి పెళ్ళి చెయ్యడం, అబ్బాయిని నా శక్తి మించినా పిజి వరకు చదివించడం, ప్రస్తుతం కనీసావసరాలకి లోటు లేకుండా మధ్యతరగతి హోదాని నిలబెట్టుకుంటుండటం...గుర్తుకొస్తుంటే నా మనసు ఆనందంతో ఉప్పొంగిపోవడంలో ఆశ్చర్యం లేదు.

నిజంగా లంకంత యిల్లు మా చందుది. ఉద్యోగంలో చేరిన పాతికేళ్ళకుగానీ నేను ఓ యింటికి ఓనరును నిపించుకోలేకపోయాను. కానీ చందూ సర్వీసులో చేరిన ఐదారేళ్ళలోనే ఘనమైన గృహం, తిరగడానికి కారు, ఇంట్లో నౌకర్లు, విలాసవంతమైన జీవితం.

అఫ్‌కోర్స్..మా కోడలు రాజేశ్వరి కూడా బ్యాంక్ ఆఫీసరే. వారిద్దరి కలల కల్పవల్లి ఈ ఇల్లు. నాలోని తండ్రికి పుత్రోత్సాహం.

ఎప్పుడు గమనించిందో, గేటు తెరుచుకుంటున్న శబ్దం వింటూనే పరిగెత్తుకొచ్చి సుడిగాలిలా చుట్టేసింది లాస్య.."తాతయ్య, నానమ్మా" అంటూ.

లాస్య...ఐదేళ్ళ మా ముద్దుల మనవరాలు.

అబ్బాయి, కోడలు ఆఫీసు నుండి వచ్చేసరికి రాత్రి ఎనిమిదిన్నర దాటింది. ఈలోగా మా కాలక్షేపానికేం కొదవ లేదు. పనిమనిషి కూడా ప్రేమగానే అన్నీ అమర్చి పెట్టింది. స్నానానికి నీళ్ళు, వేడివేడిగా పకోడీలు, కాఫీ, మధ్యమధ్యలో మా యోగక్షేమాలు కనుక్కోవడం ఈరోజుల్లో ఇలాంటి పనిమనిషి దొరకడం కూడా ఓ అదృష్టమే.

ఇక నీరజకి మనవరాలితో ఒకటే ముద్దు ముచ్చట్లు. ఇద్దరికీ క్షణం ఖాళీ లేదు. తనకి తెల్సిన కబుర్లన్నీ లాస్య చెబుతోంటే, వింటూ మురిసిపోతోంది యాభై రెండేళ్ళ నానమ్మ.

స్కూల్లో ఆటపాటల్లో, చదువులో తనే ఫస్ట్ అని చెబుతున్నప్పుడు, లాస్యలో కదలాడే ఆనందంలో నాకు చంద్రశేఖరే కనిపిస్తున్నాడు. వాడు పులిబిడ్డ. లాస్య ఆ బిడ్డకి బిడ్డ. ఆ రక్తంలో నా తెలివితేటలు. వాటిని సానబెట్టే అవకాశాలు కూడా లక్కీగా వారికి కుదిరాయి.

ఏడు గంటల ప్రాంతంలో ట్యూషన్ మాష్టారు వస్తే, ఈవేళ్టికి శెలవంటూ నేనే చెప్పి పంపించేశాను లాస్యను అడగకుండానే. అదో రకంగా నా వైపు చూసి, మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడాయన.

చందూ రాజేశ్వరి మమ్మల్ని చూసి చాలా సరదాపడ్డారు. వచ్చే ముందు ఓ ఫోన్ కొడితే బాగుండేది కదాని కోప్పడ్డారు కూడా.

నాకు తెలుసు. ఇలాంటి చిన్న సర్‌ప్రయిజ్‌లే చిన్న చిన్న ఆనందాలు. మమకారంతో అన్నా, మాట వరసకి అన్నా, నిజంగా రిసీవింగ్‌కి స్టేషన్‌కి రాగలిగే స్థితిలో వున్నారా వాళ్ళు!

నాకూ, నీరజకి మధ్య గువ్వపిట్టలా ఒదిగి కబుర్లు చెబుతూనే ఏ రాత్రికో నిద్రలోకి జారుకుంది లాస్య.

★ ★ ★

మర్నాడు ఉదయం.

ఆరింటికల్లా నిద్రలేచి ఏడింటికల్లా తయారై మరో పావుగంటలో బండెడు పుస్తకాలు బేగ్‌ని, టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్‌ని తీసుకొని స్కూల్ బస్‌లో వెళ్ళిపోయింది లాస్య.

మాలో ఒక్కసారిగా ఏదో వెలితి.

ఇంకో గంటలో కొడుకూ కోడలు కూడా ఆఫీసులకి బయల్దేరిపోయారు. మళ్ళీ వారు వచ్చేది ఏ రాత్రికో.

అతి కష్టం మీద టీవీతో కాలక్షేపం చేసేసరికి మూడు గంటలయింది. బస్ దిగింది లాస్య.

ముఖమంతా పాలిపోయి..వడలిపోయి..నీరసంగా నిస్సత్తువగా అయోమయంగా, అచేతనంగా.

ఉదయానికి, మధ్యాహ్నానికీ ఎంత తేడా! నా చిన్నారి తల్లిలో ఆ హుషారంతా ఏమైపోయింది? లేడిపిల్లలోని ఉత్సాహం ఎక్కడ పారేసుకుంది?

ఎంతో ఆప్యాయంగా ఎత్తుకున్న నా శరీరానికి వెయ్యి వోల్టుల షాక్..కొలిమిలా కాలిపోతున్న దేహం...హై టెంపరేచర్.

తడిగుడ్డతో ఒళ్ళంతా ఒత్తుతూ నీరజ ఏడ్చేస్తోంది. పసిదానికి తన దిష్టే తగిలిందని పదే పదే తిట్టుకుంటోంది.

కబురు తెలిసి, ఎలాగోలా మేనేజ్ చేసి తొందరగానే వచ్చారు లాస్య అమ్మా..నాన్న.

డాక్టరుగారు చూసెళ్ళారు. సూది మందిచ్చి, టాబ్లెట్లు, టానిక్‌లు రాసి అర్ధరాత్రి దాటాక ఒంట్లో వేడి నెమ్మదించింది గానీ, లాస్య యింకా మగతలోనే వుంది.

ప్చ్..ఏమిటో..మేం వచ్చిన ఇరవై నాలుగ్గంటల్లోపే..ఇలా..నాకెందుకో బాగా గిల్టీగా అనిపిస్తోంది.

మానసికంగా కూడా అలసిపోయిందేమో, నీరజ కూడా బాగా నిద్రలోకి జారిపోయింది. మాగన్నుగా లాస్య పక్కనే నడుం వాల్చిన నాకు, సడన్‌గా మెలకువ వచ్చేసింది. లాస్యలో పలవరింతలు. ఆమె నోట్లోంచి వస్తున్న ఒక్కోమాట ఓ త్రిశూలమై నన్ను గుచ్చేస్తోంది. ఆమె వ్యక్త పరుస్తున్న బాధ, నాలో ఉద్యోగధర్మాన్ని సూటిగా ప్రశ్నిస్తోంది.

తన దాకా వస్తేనే తెలియడం అంటే ఏమిటో నాకిప్పుడే అర్థమవుతోంది.

చాలా కాలానికి వచ్చిన మాతో గడుపుతున్న ఆనందంలో నిన్న లాస్య హోమ్ వర్క్ చేయడం మరచిపోయింది. ఎప్పుడూ స్కూల్ ఫస్ట్ వచ్చే అమ్మాయికిది మొదటి తప్పు అని కూడా చూడకుండా, ఆ ఒకటో తరగతి క్లాస్ టీచర్ బలమైన దండనే విధించింది.

స్కూలు ఆవరణ చుట్టూ కాళ్ళకి చెప్పులు లేకుండా పన్నెండుసార్లు ఎండలో పరిగెత్తడం.

పరిహాసంగా నవ్వుతున్న స్నేహితులు...క్రూరంగా చూస్తున్న క్లాస్ టీచర్...లేత హృదయంపై బలమైన గాయం. చెరగని ముద్ర. కాలుతున్న పాదాలు. గుచ్చుకుంటున్న కంకర రాళ్ళు, సొమ్మసిల్లుతున్న శరీరం, తిరుగుతున్న కళ్ళు, నాలుగో రౌండు కొట్టేసరికి ఆవిరైపోయిన శక్తి, పిడచకట్టుకుపోయిన నాలుక, మధ్యలో ఆపినందుకు మరో రెండు బెత్తం దెబ్బలు..వెరసి..బ్రతుకు బడిలో భయంతో స్పృహ తప్పిన బాల్యం.

మందులతో లాస్య రెండు మూడు రోజుల్లో పూర్తిగా తేరుకుంటుంది. కానీ ఆమె మనస్సుకైన గాయం మానడానికి ఏ లేపనం ఎవరి దగ్గర ఎప్పటికి దొరుకుతుంది. ఈలోగా గాయాల్ని రేపే గాడ్పులు మరిన్ని తగలకుండా వుంటాయా?

ఇందుకు కారణం ఎవరు?

ఇంకొక ఆరు నెలల్లో రిటైర్ కాబోతున్న ఓ కార్పొరేట్ స్కూల్ సీనియర్ టీచర్ని నేను. అయినా సమాధానం చెప్పడం నాక్కూడా కష్టమే.

పోటీ..జనాభా పెరిగిపోతోంది. వనరులు తగ్గిపోతున్నాయి. ఎంతో ప్రతిభ కనబరిస్తే తప్ప ఉద్యోగాలు లేవు. మరో వైపు శాస్త్రీయత పురోగమిస్తోంది. సౌఖ్యాల ద్వారాలు తెరుచుకుంటున్నాయి. ఎంత సంపాదించినా చాలనితనం...తనకన్నా గొప్పవాడిని తలచుకొని కుమిలిపోవడం. అనుబంధాలు, ఆత్మీయతల స్థానంలో ఈర్ష్యలు, అసూయలు, కుట్రలు, కుతంత్రాలు.

సందుకో కార్పొరేట్ పాఠశాల. వారి మీద రిజల్ట్స్ కోసం ఒత్తిడి. సరిగా మార్కులు రాకపోతే తల్లిదండ్రులే వచ్చి

క్లాస్ టీచర్ల భరతం పడతారు. విద్యావ ేర సూత్రాల్లో పిల్లల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకి స్థానం లే విపరీతమైన పోటీ ప్రపంచంలో, తల్లిదండ్రులు ె ట్టుబడిదారులై పిల్లల్ని ముడిసరుకుగా మార్చి, విద్యా ంత్ర చట్రాల మధ్య గిరగిరా తిప్పి, బయటపడుతున తుది ఉత్పత్తి పై పై రంగు, రూపుల్ని చూసి మురిసిపో ున్నారు తప్ప, ఈ ప్రాసెస్‌లో మనసు చచ్చిన శవాలే మిగులుతున్నా యని గ్రహించేదెవరు?

ఈ సంఘటన నాకూ కనువిప్పు కాగలదని అనుకుం టున్నాను. ఎందుకంటే, రోజు రోజుకీ పెరిగిపోతున్న ఒత్తిడి, చిరాకులతో, టీచర్‌గా నేనూ పిల్లలని క్రమశిక్షణ పేరుతో దారుణంగానే దండించాను.

ఇకపై కూడా నా క్రమశిక్షణ కొనసాగుతుంది. కానీ దండనతో మాత్రం కాదు. నేనూ ఓ విద్యార్థినై మళ్ళీ బాల్యాన్ని అనుభవిస్తాను. బాలల్ని అర్థం చేసుకుంటాను.

**-సి.వి.నరసింహదాసు**

**(కోల్‌కతా)**

# సారీ! కార్తీక్

"సౌమ్యా కార్తీక్ ఇంట్లో లేడా ఇల్లంతా ప్రశాంతంగా వుంది" అంటు భార్యని ప్రశ్నిస్తూ ఇంట్లోకి అడుగుపె ట్టాడు రమేశ్. భర్త పిలుపు విని వంటి ట్లోంచి బయటకు వచ్చింది సౌమ్య. భ చేతికి కాఫీ కప్పు అందించి టీవీ.ఆ చేసింది.

రమేశ్ జేబులోంచి సిగరెట్ ప్యాకెట తీస్తూ..."కార్తీక్ స్కూల్ నుండి రాలేదా?" అంటూ ప్రశ్నించాడు.

"వచ్చాడు. డ్రాయింగ్ రూంలో కూర్చుని చదువుకుంటున్నాడు" అం సౌమ్య.

టేబుల్ ముందు కూర్చుని శ్రద్ధగ చదువుకుంటున్న కొడుకుని చూసి రమే సంతోషంతో పొంగిపోతూ-

"హాయ్ కార్తీక్! హోమ్ వర్క్ చేస న్నావా?" అంటూ ఆప్యాయంగా పల రించాడు.

"అవును నాన్నా" అన్నాడు కార్తీ తల పైకెత్తకుండానే.

"శభాష్ కార్తీక్" అంటూ కొడుక భుజంపై చేయి వేసి మెచ్చుకున్నాడు రమేశ్.

అప్పటివరకు వాళ్ళ సంభాషణ వింటున్న సౌమ్య-

"మీకో విషయం తెలుసా?" అంటు భర్తని ప్రశ్నించింది.

"ఏ విషయం" తెలియనట్టుగా నొసలు చిట్లిస్తూ ప్రశ్నించాడు రమేశ్.

"ప్రక్కింటి రామారావుగారి అబ్బా యికి మ్యాథ్స్‌లో ఎన్ని మార్కులు వచ్చాయో తెలుసా? హండ్రెడ్‌కి నైంటీ సెవెన్. మ మన వాడికి సెవెంటీ సిక్స్. ఈమధ్య వీడిక చదువు మీద శ్రద్ధ తగ్గింది. ఆటలు బాగా ఎక్కువ అయ్యాయి. ఈమధ్య వీడికి మీ భయం తగ్గింది" అంటూ భార్య చెబు తుంటే రమేశ్ ఆశ్చర్యపోతూ-

"కార్తీక్ హాఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్ అయి పోయాయి కదా! ప్రోగ్రెస్ కార్డ్ ఇవ్వ లేదా" కొడుకుని ప్రశ్నించాడు కోపంగా.

కార్తీక్ భయం నిండిన కళ్ళతో తండ్రి వంక చూస్తూ..బ్యాగ్‌లో నుంచి ప్రోగ్రెస్ కార్డు తీసి తండ్రి చేతికి ఇచ్చాడు. ప్రోగ్రెస్ కార్డ్ చూసిన రమేశ్ ఆవేశంగా "ఏంట్రా ఈ మార్కులు" అంటూ ప్రశ్నిస్తూ కార్తీక్ చెంపపై కొట్టాడు.

"అమ్మా" అంటూ గట్టిగా కేకవేస్తూ తల్లి చాటుకు పరిగెత్తాడు కార్తీక్.

మళ్ళీ కొడుకు పై చెయ్యెత్తి కొట్టడా నికి సిద్ధమవుతున్న రమేశ్‌కి అడ్డువ చ్చింది సౌమ్య.

"ఇకనుండి బాగా చదువుతాడు లెండి. హాఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్‌లో తక్కువ మార్కులు వచ్చినా, యాన్యువల్ ఎగ్జా మ్స్‌లో స్కూల్ ఫస్ట్ వస్తాడు లెండి. వాడు సరిగ్గా చదవకపోవడానికి కారణం పూర్తిగా వాడే కాదు తప్పు నాలోను వుంది" అంటూ భర్తను ఆపింది.

అయినా ఆవేశం తగ్గని రమేశ్ భార్య వంక, కార్తీక్ వైపు కోపంగా చూస్తూ వరండా వైపు నడిచాడు.

"అమ్మా! మరేమో నాకు ఇంగ్లీష్ సబ్జెక్ట్ అంటే చాలా ఇంట్రెస్ట్. శేఖర్ మ్యాథ్స్ బాగా చేస్తాడు. అందుకే వాడికి మ్యాథ్స్‌లో మంచి మార్కులు వస్తాయి. నేను బాగా ట్రై చేస్తున్నాను. వాడిని మించిన మార్కులు మ్యాథ్స్ సబ్జెక్ట్‌లో సాధిం చాలని. కానీ మొన్న ఎగ్జామ్స్ సమ యంలో నాకు ఒంట్లో బాగోలేదు కదా! అందుకే ఆ సబ్జెక్ట్ బాగా రాయలేకపో యాను" అంటూ కార్తీక్ తల్లితో చెబు తున్న మాటలు వినిపించినా అంతగా పట్టించుకోలేదు రమేశ్.

రెండు నిమిషాల తరువాత ఇంట్లోకి వస్తూ..

"ఈ ఇయర్ నువ్వు సెవెన్త్ క్లాస్ అన్న విషయం మర్చిపోవద్దు కార్తీక్. యాన్యు వల్ ఎగ్జామ్స్‌లో నువ్వు ఖచ్చితంగా క్లాస్ ఫస్ట్ రావాలి. బీ కేర్ ఫుల్" అంటూ సీరి యస్‌గా చెబుతూ కసిగా సిగరెట్ అంటిం చాడు రమేశ్.

* * *

ఆఫీసులోకి ఆలస్యంగా అడుగుపె ట్టాడు రమేశ్.

అటెండర్ నమస్కరిస్తూ "సార్..అటెండెన్స్ రిజిస్టర్ మేనేజర్‌గారి క్యాబిన్‌లోకి వెళ్ళింది" అంటూ చెప్పాడు.

హడావిడిగా మేనేజర్ క్యాబిన్‌లోకి అడుగుపెడుతూ "గుడ్ మార్నింగ్ సార్" అన్నాడు వినయంగా.

ఆయన తలెత్తి రమేశ్ వైపు విసుగ్గా చూస్తూ రిజిస్టర్ అందించాడు.

రిజిస్టర్‌లో సంతకం చేసి...హుషా రుగా బయటకు వస్తున్న అతడికి "రమేశ్" అన్న పిలుపు వినిపించి చటు క్కున వెనక్కి తిరిగి "యస్..చెప్పండి సార్" అంటూ మేనేజర్ వైపు విన యంగా చూశాడు రమేశ్.

"నిన్న నేను అడిగిన ఫైల్ పూర్తి చేశావా?"

"చేశాను సార్"

"అలాగైతే...ఆ ఫైల్ ఇలా తీసుకురా! ఈరోజు ఆ ఫైల్ హెడ్ ఆఫీసుకు పంపిం చాలి" అన్నాడు మేనేజర్ రామానుజం.

"సార్..అదీ..ఓ టెన్ మినిట్స్‌లో మీ ముందుంచాను" అంటూ కదిలాడు. అరగంట తరువాత మేనేజర్ క్యాబిన్‌లోకి వెళ్ళాడు.

"సార్ మీరడిగిన ఫైల్" అంటూ తను ప్రిపేర్ చేసిన స్టేట్‌మెంట్స్ మేనేజర్ టేబుల్‌పై వుంచాడు. పది నిముషాల తరువాత రమేశ్‌కి మేనేజర్ వద్ద నుండి పిలుపు వచ్చింది.

"రమేశ్! నువ్వు ప్రిపేర్ చేసిన స్టేట్ మెంట్స్ చాలా బాగున్నాయి. బట్ ఇందులో స్పెల్లింగ్ మిస్టేక్స్ చాలా వున్నాయి. అవన్నీ కరెక్ట్ చేసుకుని కంప్యూ టర్ ప్రింట్స్ మళ్ళీ తీసుకురా. నీ ప్రక్క సీట్లో వున్న రావుగారిని చూసి నేర్చుకో రమేశ్ వర్క్ ఎలా చేయాలో! అప్పగించిన వర్క్ అడిగిన సమయానికి పూర్తి చేస్తాడు. వర్క్ ఎంతో పర్‌ఫెక్ట్‌గా వుంటుంది. ఆఫీసుకి సరి అయిన సమ యానికి వస్తాడు. మీరిద్దరూ ఎంతో కాలంగా ఫ్రెండ్స్. కానీ అతనిలోని బెస్ట్ క్వాలిటీస్‌లో ఒక్కటి కూడా నువ్వు గ్రహిం చలేకపోయావు" అంటూ రామానుజం గారు చిరుకోపంగా అంటుంటే...ఫైల్ తీసుకుని నీరసంగా తన కుర్చీవైపు కది లాడు రమేశ్.

మళ్ళీ ఆయనే..."రమేశ్ ఇలారా!" అంటూ పిలిచి...

"రమేశ్! నేనిలా చెప్పానని నీవు మరోలా భావించవద్దు. నీవు తెలివైనవా డివి. కాదని నేను అనను. కానీ నీవు చిన్న చిన్న విషయాల పట్ల శ్రద్ధ తీసుకోవు. మనం చిన్న తప్పులుగా భావించే ఎన్నో విషయాలు మన జీవిత గమనాన్ని మన వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తాయన్న విషయాన్ని నీవు తెలుసుకోవాలి. ముందు నీవు నీ ఇంగ్లీష్ నాలెడ్జ్ పెంచుకో. ఇక ముందు ఇలాంటి మిస్టేక్స్ రాకుండా జాగ్రత్త తీసుకో!" అంటూ రామానుజంగారు చెబుతుంటే "అలాగే సార్" అంటూ బయటకు కదిలాడు రమేశ్. కంప్యూటర్ ముందు కూర్చున్న అతడి కళ్ళముందు కార్తీక్ రూపం కదిలింది.

* * *

వరండాలో కూర్చుని పేపర్ చదువు తున్న కార్తీక్, సౌమ్యల దగ్గరికి వచ్చాడు రమేశ్.

"ఏమండి..ఈవేళ పేపర్ చూశారా?" ప్రశ్నించింది సౌమ్య.

చూడలేదన్నట్టుగా తల అడ్డంగా ఊపాడు రమేశ్.

"ఈరోజు ఇంగ్లీష్ పేపర్ 'కిడ్స్ స్పెషల్'లో మన కార్తీక్ రాసిన స్టోరీ ప్రింట్ అయిందండి" అంటూ సంతోషంగా చెబుతూ పేపర్ భర్త చేతికి అందించింది సౌమ్య.

స్టోరీ చదివి కార్తీక్‌ని అభినం దిస్తూ..తలపై ప్రేమగా నిమిరాడు రమేశ్.

**-గొర్రెపాటి శ్రీను**

**(హైదరాబాద్)**